క్లుప్తంగా

మహాశివరాత్రి వేడుకలు

గూడూరు : మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడురోజుల వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. సనాతన శివాలయ చైర్మన్ డాక్టర్ డాక్టర్ ఏవూరి రవిందర్‌రెడ్డి దీపారాధన చేసి పూజలు ప్రారంభించారు. ప్రధాన పూజారి భానుప్రకాష్ శాస్త్రి, సతీష్ పాండే వేద మంత్రోచ్చారణలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, శివ, సాగర్, యుగేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్‌ఓగా జ్యోతి



మరిపెడ: జిల్లా ఉత్తమ బీఎల్‌ఓగా జ్యోతి ఎంపికైనట్లు తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆమెను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. అభినందించిన వారిలో పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, వీఏఓలు హుస్సేన్, పాష ఉన్నారు.

ఎంపిక

మరిపెడ రూరల్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉమెన్స్ కబడ్డీ పోటీలకు మరిపెడ మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం పీఈటీ భూక్య విజేత ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పీఈటీ విజేతను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, గిరిపురం సర్పంచ్ జనార్ధన్, పీవీఆర్‌ఎస్ శాస్త్రి, కాలునాయక్, మల్లయ్య, పీఈటీ రాంబాబు పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించాలి

బయ్యారం: పదో తరగతిలో విద్యార్థులు కష్టపడి చదివి 10 జీపీఏ పాయింట్లు సాధించాలని ఎంఈఓ పూల్‌చంద్ సూచించారు. గురువారం బయ్యారంలోని ఓ ఫంక్షన్ హాలులో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుకొని 10 వ తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా చేతన ఫౌండేషన్ అధ్యక్షుడు వెనిగళ్ల రవి 160 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం అందజేశారు. సదస్సులో జీసీడీఓ విజయకుమారి, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ బోయినపల్లి గిరిజన వాటర్ స్పోర్ట్స్ కో ఎడ్యుకేషన్ పాఠశాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అర్హులైన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన శాఖ అధికారి ఎర్రయ్య గురువారం తెలిపారు. విద్యార్థులు 9 నుంచి 11 సంవత్సరాలు ఉండాలని, 5వ తరగతిలో 20 సీట్లు బాలురకు, 20 బాలికలకు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులను నేరుగా కొత్తగూడ మోడల్ పాఠశాలలో అందజేయాలని సూచించారు. ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా గిరిజన శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ కానుక కల్యాణలక్ష్మి

బయ్యారం: ఆడబిడ్డల పెళ్లికి ప్రభుత్వ కానుక కల్యాణలక్ష్మి అని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు అన్నారు. గురువారం స్థానిక రైతువేదిక భవనంలో నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో వారు పాల్గొని, మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చేపూరి మౌనిక, వైస్ ఎంపీపీ గణేష్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్, సర్పంచ్ కోటమ్మ, తహసీల్దార్ రమేష్, రామూర్తిగౌడ్, ఉపసర్పంచ్ కవిత, ఎంపీటీసీలు శైలజ, భద్రయ్య, సత్యనారాయణ, సోమిరెడ్డి, ఉప్పలయ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కురవి: జీపీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సీఐటీయూ అనుబంధ గ్రామ పంచాయతీ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీ నుంచి కురవి నుంచి పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఉపేంద్రాచారి, పోతుగంటి మల్లయ్య, అశోక్, అప్పిరెడ్డి, సుధాకర్, రామచంద్రయ్య, శ్రీను, ముజేందర్, సుమన్, వెంకటలక్ష్మి, వెంకటదాసు, లతీఫ్, కుమారస్వామి, జానిమియా, మంగీలాల్ పాల్గొన్నారు.

కుటుంబ పాలన పోవాలి

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణాలో రాక్షస కుటుంబ పాలన పోవాలని బీజేపీ ఎఫ్‌పీఓ రాష్ట్ర కన్వీనర్ కాలేరు నేతాజీ అన్నారు. బీజేపీ శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్ అయోధ్య గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా నేతాజీ మాట్లాడారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పసుపులేటి నవీన్ కుమార్, చెక్కల గిరిబాబు, బూత్ అధ్యక్షులు నాగార్జున, సురేష్, వెంకటేష్, ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సర్దుబాటులోపం

- కొన్ని శాఖలకు గదులు సరిపోక అవస్థలు
- సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన అధికారులు



కార్యాలయంలో కుప్పలుగా వేసిన ఫైళ్ల మూటలు



ఒకే గదిలో కొనసాగుతున్న రెండు కార్యాలయాలు

మహబూబాబాద్: అన్ని హంగులతో నూతన కలెక్టరేట్‌ను పూర్తి చేశారు. కార్యాలయంలో పలు శాఖలకు అవకాశం కల్పించారు. కానీ, ఆ శాఖల సిబ్బంది, ఫర్నీచర్, ఫైళ్లు ఇతరత్రా సామగ్రిని పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. నూతన కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆ కార్యాలయంలో ఉన్న గదులను బట్టి సీపీఓ శాఖ ద్వారా 38 శాఖలకు గదులు కేటాయించారు. ముందుగా ఆ గదులకు ఆశాఖల నేమ్ బోర్డులను కూడా ఏర్పాటు చేసి ఆశాఖల అధికారులకు చూపించారు. డీఆర్‌డీఓ (ఫించన్‌ల విభాగం) డీటీఓ, ఏడీ అండ్ ల్యాండ్ రికార్డుల శాఖ, డీడబ్ల్యూఓ, ఏఓ కలెక్టరేట్, డీపీఆర్‌ఓ, కలెక్టర్, అదనపు కలెక్టర్లు చాంబర్‌లతో పాటు మీటింగ్ హాల్స్ ఇతరత్రా ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఓ (మెప్మా)డీసీఎస్‌ఓ, సివిల్ సప్లై మేనేజర్, ఏడీ మైన్స్, భూగర్భజల శాఖ, ఎస్సీ కార్పొరేషన్, డీఎంహెచ్‌ఓ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, లేబర్, ఆడిట్ శాఖ, తూనికలు కొలతలు, ఎండోమెంట్, డీపీఓ, డీఏఓ, ఉద్యానవన శాఖ, జిల్లా క్రీడల శాఖ, సహకార శాఖ, జిల్లా ఉపాధి కార్యాలయం, డీటీడీఓ, టూరిజ ఇతరత్రా శాఖలకు కేటాయించారు. కలెక్టరేట్‌లోకి ఆయా శాఖల సామగ్రి తరలించారు.

సర్దుబాటు లోపం

శాఖలలో సిబ్బంది ఫర్నీచర్ ఇతరత్రా విషయాలను పరిగణలోకి తీసుకోకుండా గదులు కేటాయింపు చేశారు. జిల్లా ఉపాధి కార్యాలయానికి ఒక గదిని మాత్రమే కేటాయించారు. ఆకార్యాలయంలో జిల్లా ఉపాధి అధికారితో పాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఎంజీఎంఎఫ్ సిబ్బంది పని చేస్తున్నారని ఒక గది సరిపోవడం లేదని ఆగదిలోనే టౌన్ ప్లానింగ్, టూరిజం శాఖ అధికారులకు కూడా కేటాయించారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్, భూగర్భజల శాఖకు ఒకే గది కేటాయించగా మధ్యలో బీరువాలు ఏర్పాటు చేసి వరుసగా కుర్చీలు వేసుకున్నారు. మైనింగ్ శాఖలో ఏడికి మొదటి కుర్చీ ఆతర్వాత సిబ్బందికి వరుసగా 11 మందికి ఏర్పాటు చేయగా భూగర్భ జలశాఖకు జిల్లా అధికారికి మొదటి కుర్చీ దాని తర్వాత వరుసగా 8 మంది సిబ్బంది కుర్చీలు ఏర్పాటు చేశారు. జిల్లాసంక్షేమ శాఖకు రెండు గదులు కేటాయించగా ఒక గది జిల్లా అధికారికి పోను ఉన్న చిన్నగదిలో 11 మంది టేబుల్‌లు కుర్చీలు ఏర్పాటు చేసుకుని విధులు నిర్వరిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో డీటీడీఓకు గది కేటాయించగా గదిలోనే 12మంది సిబ్బంది విధులు నిర్వరిస్తున్నారు. తూనికల కొలత శాఖకు కేటాయించిన ఒక గదిలోనే కాంటాలు బాట్లు ఇతరత్రా సామగ్రి నిల్వ చేయగా ఎండోమెంట్‌కు అదే గది కేటాయించారు. జిల్లా సహాయక కార్మిక కమిషనర్ శాఖ పరిస్థితి కూడా అంతే.

కలెక్టర్ దృష్టికి..

పలు శాఖల అధికారులు వారి సమస్యలను కలెక్టర్ శశాంక దృష్టికి తీసుకెళ్లిన్నట్లు చెబుతున్నారు. పలు శాఖల సామగ్రి, ఫర్నీచర్ పాత కార్యాలయాల్లోనే ఉంచాల్సి వచ్చిందని తెలిపారు. అన్ని శాఖలు కలెక్టరేట్‌లో ఉండాలనే ఆదేశాలు ఉన్నందునే శాఖలకు గదులు కేటాయించామని సీపీఓ సుబ్బారావు చెప్పారు.

బీదర్ టు భవానిగడ్డతండా..

- 10 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం
- మూడు వాహనాలు సీజ్
- ఏడుగురిపై కేసు నమోదు



బెల్లం, వాహనాలను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కేసముద్రం: కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి అక్రమంగా వాహనంలో కేసముద్రం మండలం భవానిగడ్డ తండా జీపీకి తరలించిన 10 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని, గూడూరు ఎక్సైజ్‌శాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గూడూరు ఎక్సైజ్ శాఖ సీఐ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. భవానిగడ్డ తండా జీపీకి చెందిన నూనావత్ కిషన్, నూనావత్ రాము, నూనావత్ వీరు, నల్గొండ జిల్లా కొండమల్లెపల్లికి చెందిన డ్రైవర్ ఇరుగడిండ్ల నాగయ్యతో కలిసి, తన వాహనంలో బీదర్‌కి వెళ్లి, అక్కడి నుంచి 20 బస్తాల నల్లబెల్లాన్ని(1000 కిలోలు) అక్రమంగా భవానిగడ్డతండాకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు తండాకు చేరుకుని, 10 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని, అశోక్ లెలాండ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే తండాలో పలుస్థావరాలపై దాడులు చేసి 300 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. ఇదే సమయంలో నల్లబెల్లం విక్రయించి టీవీఎస్‌పై తీసుకెళ్తున్న గూడూరు మండలం కొల్లాపురం శివారు ఇప్పల్‌తండాకు చెందిన దారావత్ లచ్చిరామ్‌ను, నెక్కొండ మండలం చిన్నకొర్పోలు శివారు కున్సోత్‌తండాకు చెందిన కున్సోత్ మంజుల, భుక్యా సురేష్‌లు 90 లీటర్ల సారాయిని, పల్సర్ మోటారు సైకిల్‌పై ఇక్కడికి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు మొత్తం ఏడు గురిపై కేసు నమోదు చేసి, మూడు వాహనాలను సీజ్ చేసి, బెల్లం, సారాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జయశ్రీ, కానిస్టేబుల్‌లు సుధాకర్, వెంకన్న, యుగేందర్, దేవేందర్ పాల్గొన్నారు.

అరుణాదేవి మృతికి మంత్రి సత్యవతి సంతాపం



నివాళులర్పిస్తున్న మంత్రి, జెడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎంపీ మాలోతు కవిత

మహబూబాబాద్ రూరల్ : డోర్నకల్ నియోజకవర్గ సీనియర్ నేత, కురవి మాజీ వైస్ ఎంపీపీ ఎర్రంరెడ్డి నర్సింహారెడ్డి సతీమణి ఎర్రంరెడ్డి అరుణాదేవి గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. మంత్రి సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు, ఎమ్మెల్యే శంకర్ నాయక్, డాక్టర్ సీతామహాలక్ష్మీ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో ఎమ్మెల్యే శంకర్ నాయక్ పాడె మోశారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, వెంకన్న, శ్రీను, మురళీధర్ రెడ్డి ఉన్నారు.

పరామర్శ

డోర్నకల్: కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన ఉమ్రావ్‌దేవీ కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్ గురువారం పరామర్శించారు. స్థానిక అశోక్‌భవన్‌లో ఉమ్రావ్‌దేవి కుమారులు సునీల్‌పాట్ని, సుధీర్‌పాట్ని, మన్యుపాట్ని, సంజయ్‌పాట్నితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. వెంకటరెడ్డి, హనుమంతరావు, అనిల్, శ్రీనివాస్, భద్రునాయక్ ఉన్నారు.

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌కి చెందిన ప్రముఖ న్యాయవాది తుంపిళ్ల శ్రీనివాస్ తల్లి రామనర్సమ్మ, ఉప్పరపల్లిలో సీనియర్ జర్నలిస్ట్ ఆవుల యుగేందర్ తండ్రి మల్లయ్య ఇటీవల మృతిచెందారు. ఎంపీ మాలోతు కవిత బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. కేఎస్ఎన్ రెడ్డి, ముత్యం వెంకన్న, మహబూబ్‌పాషా, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

గూడూరు: ఎంపీపీ బానోతు సుజాత తండ్రి గుగులోతు ఈర్యానాయక్ (65) అనారోగ్యంతో మృతిచెందగా.. ఎంపీపీ కుటుంబాన్ని ఎమ్మెల్యే శంకర్ నాయక్ దంపతులు గురువారం పరామర్శించారు.

పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయ్..



మన ఊరు మన బడిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

డోర్నకల్: మన ఊరు, మన బడి కార్యక్రమం అమలుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని ఎమ్మెల్యే రెడ్యానాయక్ పేర్కొన్నారు. మండలంలోని వెన్నారం, చిలుకోడు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తయిన మన ఊరు, మన బడి పనులను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమం అమలుతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా వసతులు ఏర్పాటయ్యాయని తెలిపారు. మన ఊరు అమలుతో భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల ద్వారా ఉత్తమ ఫలితాలు రానున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్, మండల ప్రత్యేక అధికారి ఛత్రునాయక్, జడ్పీటీసీ సభ్యురాలు పొడిశెట్టి కమలారామనాథం, సర్పంచులు బోయిన వెంకన్న, రాయల వెంకట్‌బాబు, పగడాల అంజయ్య, ఎంపీడీఓ అపర్ణ, తహసీల్దారు స్వాతిబిందు, టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా రమణ, హెచ్‌ఎంలు రమేష్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరూ బీమా చేయించుకుంటే ఆర్థికర భద్రత ఉంటుందని ఎమ్మెల్యే రెడ్యానాయక్ తెలిపారు. తొడేళ్లగూడెం గ్రామంలో బొడ్డు వెంకన్న అనారోగ్యంతో మృతి చెందగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.4.15 లక్షల చెక్కును ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అంతకు ముందు గ్రామస్తుల కోరిక మేరకు గ్రామ సమీపంలోని సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించి ఆలయ నిర్మాణానికి ఆర్థికంగా సహకరిస్తానని తెలిపారు. చిలుకోడులో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. డోర్నకల్‌లో వివాహవేడుకకు హాజరై నూతన దంపతులు వంశీ విశాల్, ప్రత్యూషను ఆశీర్వదించారు.

సేవాలాల్ జయంతి



వేడుకలను నిర్వహిస్తున్న ఆమ్ ఆద్మీ నాయకులు

గార్ల: మండలంలోని రాజుతండాలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను గురువారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. తొలుత సేవాలాల్ మహారాజ్‌కు భోగ్ భండారో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తండాలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా రాంబాయి హరిలాల్, ఎంపీటీసీ బానోత్ మంజుల, కిషన్, రమేష్, హరిరాం, బాబు, బుచ్చ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కార్యాలయంలో గోర్ బంజారాల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ జయంతి వేడుకలను పార్టీ రాష్ట్ర కోశాధికారి భూక్య శోభన్ బాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సేవాలాల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోఆర్డినేటర్ మాలోత్ సురేష్ బాబు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్, శరత్, యాకోబ్, సంతోష్, సుమన్, మహేష్ పాల్గొన్నారు.

'డ్రోన్' పిచికారీపై అవగాహన

కురవి: మండలంలోని నేరడలో మిర్చి పంటను పీడిస్తున్న నల్లతామరను నివారించేందుకు డ్రోన్ ద్వారా మందును పిచికారీ చేయడంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ధరణిపుత్ర రైతు ఉత్పత్తిదారుల సంస్థ సహకారంతో సౌత్ ఏరియా బయోలాజీ సెంటర్(దక్షిణ ఆసియా జీవసాంకేతిక విజ్ఞాన కేంద్రం) ఎస్ఏడీసీ డాక్టర్ శ్రవణ్‌కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ మాట్లాడారు. డ్రోన్ ద్వారా పంటపై మందును పిచికారి చేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండోజు శ్రీనివాసాచారి, సంస్థ డైరెక్టర్‌లు కె.ఆంజనేయులు, యాదగిరి, వెంకన్న, కేవీకే శాస్త్రవేత్త కిషోర్, ఏఓ మంజుఖాన్, ఉద్యానవన అధికారి అనితాశ్రీ పాల్గొన్నారు.

తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలి

గూడూరు : తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని అటవీ ప్రాంతంలో జీవిస్తున్న ఆదివాసులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం తునికాకు సేకరణకు కాంట్రాక్టు పద్ధతి ప్రవేశపెట్టిందన్నారు. ఇదే అదనుగా చేసుకుని కాంట్రాక్టర్లు ఆదివాసులను అమాయకులను చేసి సొమ్ము కూడ బెట్టుకుంటూ మోసం చేస్తున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా తునికాకు బోనస్‌లు ఇవ్వకుండా ప్రభుత్వం, పారెస్టు అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై తునికాకు సేకరించే అమాయక ప్రజలకు డబ్బులు ఎగ్గొట్టారని ఆరోపించారు. తునికాకు సేకరించేవారికి ప్రమాద బీమా, ప్రమాదవశాత్తు కౄరమృగాల బారిన పడి గాయపడినా, మృతి చెందినా రూ.25లక్ష ఎక్స్‌గ్రేషియా, ఇగురు కొట్టే కూలిలకు రోజుకు రూ.500 చెల్లించి నీటి సౌకర్యం కల్పించాలన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

గార్ల: మండలంలోని సీతంపేటలో 3 జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి గ్రామీణ క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు తమ టీం ఎంట్రీల నమోదుకు 84979 08478, 99630 60396 నంబర్ల ద్వారా సంప్రదించాలని క్రికెట్ పోటీల నిర్వాహకులు మాలోత్ భాస్కర్, భూక్యా సర్వేష్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు జాటోత్ ఝాన్సీలక్ష్మి, ఎంపీటీసీ నాగమణి, మార్కెట్ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మీరాపతాన్, మాన్‌సింగ్, భద్రాజీ, వెంకటేశ్వర్లు. రామ్‌సింగ్, శ్రావణ్‌కుమార్, కమార్ గౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి


కేసముద్రం: ప్రతి ఒక్కరూ చదువుతోపాటు, క్రీడల్లో రాణిస్తే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర బాస్కెట్ బాల్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ముల్లంగి ప్రతాప్ అన్నారు. గురువారం మండలంలోని పెనుగొండలో పెనుగొండ క్రికెట్ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇలాంటి క్రీడాపోటీలను ఏర్పాటుచేయడం వలన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కాగా మాజీ మార్కెట్ చైర్మన్ మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి తన తండ్రి చల్మారెడ్డి జ్ఞాపకార్థం ప్రథమ బహుమతి నగదు రూ.30,116, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు తన తండ్రి రామన్న జ్ఞాపకార్ధంగా ద్వితియ బహుమతి నగదు రూ.20,116, షీల్డ్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహబూబాబాద్ వైస్ ఎంపీపీ ఎల్లి మల్లయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, నిర్వాహకులు ప్రవీణ్, ఉమేష్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

లారీ ఢీకొని ఒకరి మృతి

గూడూరు : మండల కేంద్రంలో నర్సంపేట వైపునకు వెళ్లే జాతీయ రహదారిపై గురువారం ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగారం మండలం కొత్తగుంపునకు చెందిన తుర్క ప్రభాకర్ అతని భార్య కోటేశ్వరి, కూతురు నందిత, వారి బంధువు దనసరి లక్ష్మయ్య (45) కలసి ద్విచక్ర వాహనంపై బుధవారం సాయంత్రం గూడూరు మండలంలోని మట్టెవాడలో జరిగిన ఓ వివాహాక వేడుకలకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారి పక్కన గల పెట్రోల్ పంపు వైపునకు ద్విచక్ర వాహనాన్ని తిప్పారు. అదే సమయంలో వారి వెనకాల వస్తున్న లారీ రోడ్డు క్రాస్ చేస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య (45) అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు చేరుకుని గాయాలపాలైన వారిని అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ గౌడ్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



గార్ల: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగుమందు తాగి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల మండలం కొత్తపోచారానికి చెందిన కుక్కల ఎల్లయ్య(52)కు 2 సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చింది. నాటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పొలం పనులకు వెళ్లి వచ్చిన కుటుంబ సభ్యులు ఎల్లయ్యను హుటాహుటిన మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. మృతిచెందాడు. మృతుడి కుమారుడు కొండల్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

రేప్ కేసు నిందితుడి అరెస్ట్

గార్ల మండలంలోని ఒంటిగుడిసె తండాకు చెందిన భూక్యా నరేష్ 2017లో రేప్ కేసులో నిందితుడై ఉన్నాడు. పలుమార్లు కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో మహబూబాబాద్ జిల్లా కోర్టు నరేష్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఎస్సై వెంకన్న గురువారం నరేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో..

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లిలో తాళం వేసి ఉన్న ఒకరి ఇంట్లోకి చొరబడి, బంగారు ఆభరణాలు, నగదు రూ.19వేలను అపహరించిన ముగ్గురు వ్యక్తులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరపల్లికి చెందిన తిరుగుడు లింగయ్య ఈనెల 14న భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లారు. తిరిగి ఇంటికి రాగా, ఇంటి తాళం తీసి, బీరువాను పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న పావుతులం బంగారు ఆభరణాలు, రూ.19వేలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో గురువారం గ్రామంలో అనుమానస్పదంగా తిరుగుతున్న సకినాల సాయి అనే వ్యక్తితోపాటు, అతడి ఇద్దరి స్నేహితులను పోలీసులు పట్టుకుని విచారించడంతో, దొంగతనానికి పాల్పడిన విషయాన్ని ఒప్పుకున్నారు. దీంతో నిందితుల నుండి సొమ్మును రికవరీ చేసి, ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పీడీయాక్టు నమోదు



నాగేశ్వర్‌రావును జైలుకు తరలించిన అధికారులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం రేకులతండాకు చెందిన గుగులోత్ నాగేశ్వర్‌రావుపై పీడీయాక్టు నమోదు చేసి చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించామని ఎక్సైజ్ శాఖ డీటీఎఫ్ సీఐ బి.కృష్ణ గురువారం తెలిపారు. అతడిపై ఆరు కేసులు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో మరో 15 మందిపై పీడీయాక్టు నమోదుకు చర్యలు చేపట్టనున్నామని, ఏ సమయంలోనైనా వారిని అరెస్టు చేసి జైలుకు తరలిస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం..

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని సమైక్య జూనియర్ కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ వారి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు సందర్భంగా మహబూబాబాద్ సీఎఫ్ఎల్ వారి ఆధ్వర్యంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆర్ఎస్ మూర్తి విద్యార్థులకు గురువారం అవగహన కల్పించారు. ఎఫ్ఎల్‌సీ రమేష్, కౌన్సిలర్ షరీఫ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బయ్యారం: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తుడుం వెంకన్న కుటుంబానికి మణి జనరల్ హాస్పిటల్ యజమాని బచ్చలకూర కరుణాకర్ గురువారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామస్తులు కరుణాకర్‌ను అభినందించారు. లక్ష్మణ్, వార్డు సభ్యులు రేణుక, వెంకన్న, రాజశేఖర్, రాజేష్, నరేష్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

గార్ల: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గార్లలో నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో నేటికీ జిల్లాలోని పలు హైస్కూళ్లలో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బెంచీల బహూకరణ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలో పునఃప్రతిష్ఠించిన బొడ్రాయి వద్ద భక్తుల సౌకర్యార్థం స్వర్గీయ పర్యాల నారాయణ రెడ్డి జయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు పర్యాల శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకటరెడ్డి బెంచీలను గురువారం ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్, పర్యాల శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. నాగేశ్వర్‌రావు, జనార్ధన్, రమేష్, గంగాధర్, రాజు, జగన్, వెంకటేశ్వర్లు, పిల్లి సుధాకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'

తొర్రూరు రూరల్: గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని సోమారపు కుంట తండలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ బానోతు యాకమ్మ, డాక్టర్ హరికిషన్, ఉప సర్పంచ్ వెంకన్న, రాజు పాల్గొన్నారు.

కురవి: ప్రజలు కంటివెలుగును వినియోగించుకోవాలని డాక్టర్ అశోక్ కుమార్ అన్నారు. గురువారం కొత్తూరు(జీ) శివారు బంగారుగూడెం జీపీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ జీవన్ ప్రారంభించారు. ఉప సర్పంచ్ చాట్ల మంజుల, పంచాయతీ కార్యదర్శి మహేష్, సత్యనారాయణ, కృష్ణకుమార్, పూర్ణచందర్, కౌర్, సక్సేనా, సంకీర్తన, చంద్రకుమార్, ఉపాధ్యాయులు శ్రీదేవి, సుమాంజలి, మాధవ్‌నాయక్, గాంధీ, సరోజ, నీల, తిరుపతమ్మ, వెంకటమలక్ష్మి పాల్గొన్నారు.

ఈశ్రామ్ పథకాన్ని వినియోగించుకోవాలి

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈశ్రామ్ పథకాన్ని కార్మికులందరూ వినియోగించుకోవాలని సహాయ కార్మికశాఖ అధికారి రమేష్ గురువారం తెలిపారు. జిల్లాలో పని చేస్తున్న అసంఘటిత కార్మికులు, ఈఎస్ఐ, ఈపీఎఫ్, ఆదాయపన్ను చెల్లించనివారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రోజువారీ కూలీలు, వ్యవసాయరంగ కార్మికులు, హమాలీ, భవన నిర్మాణ కార్మికులు కామన్ సర్వీస్ పాయింట్ వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌తో ఈశ్రామ్ కార్డును పొందివచ్చని సూచించారు.

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

నెహ్రూసెంటర్: ప్రభుత్వాలు హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు కొత్తపల్లి రవి అన్నారు. ఈ నెల 22వ తేదీన ప్రజాపంథా ఆవిర్భావం సందర్భంగా గ్రామగ్రామాన జెండాను ఎగురవేయాలని పిలుపునిస్తూ జిల్లా కేంద్రంలో కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కార్మికవర్గ నాయకత్వంలో ప్రజలు అనేక వర్గపోరాటాలు నిర్వహించడానికి ప్రజాపంథాతో కలిసి చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి పైండ్ల యాకయ్య, శ్రీకాంత్, పాష, ఎస్‌కె పాష, వీరు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చౌకబారు విమర్శలు మానుకోవాలి

తొర్రూరు: మచ్చలేని నేత మంత్రి ఎర్రబెల్లిపై రేవంత్‌రెడ్డి చౌకబారు విమర్శలు మానుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్యతో కలిసి సీతారాములు మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధిలో తీసుకెళ్తూ కేంద్ర అవార్డులు దక్కించుకుని రాష్ట్ర ప్రతిష్ఠను నిలుపుతున్న దయాకర్‌రావుపై టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యలు దారుణమన్నారు. చివరిదశలో ఉన్న కాంగ్రెస్‌ను నడుపుతున్న రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి పట్టిన చీడ అన్నారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, నాయకులు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, ఎన్నమనేని శ్రీనివాసరావు, కొమురయ్య, కాలునాయక్, అంకూస్, దొంగరి శంకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.